క్లుప్తంగా

చదవడం మాకిష్టం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గ్రంథాలయానికి రావడం విద్యార్థులు అలవాటు చేసుకోవాలని మన్నార్ సర్కిల్ అధినేత బాల మురళీకృష్ణ అన్నారు. స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. మొగల్తూరు ప్రతిభ ఇంగ్లిషు మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ ఆకన రవిచంద్ర విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. జనరల్ నాలెడ్జ్, గణితంలో మెళుకువలు నేర్పించారు. లైబ్రేరియన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జాయ్ ఆఫ్ గివింగ్

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఆర్జేడీ చప్పిడి కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో అర్థశాస్త్ర విభాగం జాయ్ ఆఫ్ గివింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఇవ్వడమనే ఒక ఉన్నతమైన గుణం విద్యార్థి దశ నుంచీ అలవడుతుందన్నారు.

గ్యాస్ సిలెండర్ల పట్టివేత



సిలెండర్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

కంబాలచెరువు: స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని నాయుడుగారు ఫ్యామిలీ రెస్టారెంట్‌లో గృహావసరాల సిలెండర్లు వాడుతున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో ఆ ప్రాంతంలో మంగళవారం దాడి చేసి ఏడు డొమెస్టిక్ సిలెండర్లను పట్టుకున్నారు. హోటల్ యజమాని సంగుల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ మాట్లాడుతూ డొమెస్టిక్ (గృహ) సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో కార్యాలయ సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ లోవరాజు, వీరబాబు, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు సూర్య

ప్రకాశం నగర్: బెంగాల్‌లో డిసెంబర్‌లో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎస్‌కేవీటీ విద్యార్థి తాడేపల్లి సూర్య ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎబల్ రాజబాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. భీమవరంలోని అల్లూరి సీతారామరాజు మెమోరియల్ ఆడిటోరియంలో సెప్టెంబర్ 14, 15 తేదీల్లో జరిగిన ఓపెన్ స్టేట్ యోగా పోటీల్లో సూర్య తృతీయ స్థానంలో నిలిచి, జాతీయ పోటీలకు అర్హత సాధించాడన్నారు. ఈ సందర్భంగా సూర్యను స్పోర్ట్స్ విభాగ అధిపతి పీఏ కిషోర్ బాబు, అధ్యాపకులు డీవీ రమణమూర్తి, గాలి వెంకటరమణ, జి.శరత్ బాబు, మేడూరు నరసింహ తదితరులు అభినందించారు.

శ్రీకృష్ణదేవరాయలుకు నివాళి

ప్రకాశం నగర్: విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతిని మంగళవారం గోకవరం బస్టాండ్ వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటానికి శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యెనుముల రంగబాబు మాట్లాడుతూ హంపి విజయనగర సామ్రాజ్యంలో శ్రీకృష్ణదేవరాయలు పాలనను స్వర్ణయుగంగా పేర్కొంటారన్నారు. నగరంలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలన్నారు. అడబాల మరిడయ్య, బండారు వెంకట రమణ, పెమ్మనబోయిన రాజేష్, అల్లాడ లోవరాజు, గరగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డాక్టర్ రామారెడ్డికి పద్మశ్రీ ఇవ్వాలి

ప్రకాశం నగర్: దేశంలోనే తొలిసారిగా యోగా థెరపీలో పీహెచ్‌డీ సాధించిన జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) గౌరవాధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డికి పద్మశ్రీ పురస్కారం అందజేయాలని సంఘం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అన్నారు. మంగళవారం స్థానిక మానస హాస్పిటల్‌లో డాక్టర్ రామారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. వీరభద్రరావు మాట్లాడుతూ రామారెడ్డి నిత్య విద్యార్థిగా 3 పీహెచ్‌డీలు, 16 పీజీలు, 34 డిగ్రీలు చేసి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ పృథ్వీ రచించిన పలు గ్రంథాలను రామారెడ్డికి బహుకరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వి.రమాదేవి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కంబాలచెరువు: కాతేరుకు చెందిన పి.మాసరావు (50) అదృశ్యమైన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఈనెల 12 న ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంద్రబాబు కోసం పూజలు

ధవళేశ్వరం: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ధవళేశ్వరం ఆంజనేయస్వామి ఆలయంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పండూరి అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మెట్రో సిటీలకు దీటుగా రాజమహేంద్రవరం



కంబాల చెరువును ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, చిత్రంలో ఎంపీ భరత్‌రామ్, కలెక్టర్



కంబాల చెరువులో లేజర్ షో

- మంత్రి ఆదిమూలపు సురేష్
- కంబాలచెరువు పార్కు ప్రారంభోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: దేశంలోనే పెద్ద నగరాలతో పోటీ పడేలా రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేస్తున్నామని, దానికి నిదర్శనమే ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. రూ.13 కోట్లతో ఆధునీకరించిన వాకర్స్ పార్కు, లేజర్ షో, వంటి అత్యాధునిక పద్ధతులతో తీర్చిదిద్దిన కంబాల చెరువును మంగళవారం కలెక్టర్ మాధవీలత, ఎంపీ మార్గాని భరత్ రామ్, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, జేసీ తేజ్ భరత్, కమిషనర్ దినేష్ కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం అభివృద్ధికి ప్రభుత్వం రూ.125 కోట్ల ప్రత్యేక నిధులను మంజూరు చేసిందన్నారు. ప్రజలను ఆహ్లాదపరిచేలా ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలను నగరంలో చేపట్టడం జరిగిందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలే జగనన్న ప్రభుత్వం పారదర్శక పాలన, జవాబుదారీ తనానికి ప్రతీక అన్నారు. అంతకు ముందు ఆయన నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

పర్యాటక కేంద్రంగా..

ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ సమష్టి కృషితో కంబాల చెరువును సుందర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేశామన్నారు. తద్వారా ఇప్పటి వరకూ విమర్శలు చేసిన వారికి సమగ్ర అభివృద్ధి చేసి చూపడం జరిగిందన్నారు. కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో కలిసి చూడదగిన పర్యటక ప్రాంతంగా కంబాల చెరువును అభివృద్ధి చేశామన్నారు. దీని నిర్వహణ బాధ్యతలు పూర్తిగా ఆర్ఎంసీ చేపట్టడం జరుగుతుందన్నారు. కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, మునిసిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అందించిన సహకారానికి నగర, జిల్లా ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, సంకిస భవానీ ప్రియ, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, టీకే విశ్వేశ్వరరెడ్డి, కానుబోయిన సాగర్, మార్తి లక్ష్మి, బర్రే కొండబాబు, పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, కాటం రజనీ కాంత్, మాజీ కార్పొరేటర్లు ఏవీ రమణ, వాకచర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ ప్రారంభించిన మంత్రి ఆదిమూలపు సురేష్

భవానీ భక్తులకు వడిభిక్ష



భవానీ భక్తులకు వడిభిక్ష వడ్డిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజానగరం: భవానీ మాల ధరించి, దీక్షతో జాతీయ రహదారిపై విజయవాడకు నడిచి వెళ్లే భక్తులకు ఉదయం వేళలో ఐదు రోజుల పాటు వడిభిక్షను అందించే కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీ భరత్ రామ్ ప్రారంభించారు. దివాన్ చెరువు నుంచి నాలుగో బ్రిడ్జికి వెళ్లే మార్గంలో దీన్ని నిర్వహిస్తున్నారు. తేజ పురోహిత్ జైన్‌సింగ్ బృందం ఏటా భవాని భక్తులకు వడిభిక్ష నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాదిలో కూడా ఐదు రోజులు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, సంకిస భవానీ ప్రియ, నొడగల సుధా, ఎన్వీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిసెంబర్ 22, 23 తేదీల్లో గైట్‌లో జాతీయ సదస్సు

రాజానగరం: గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో డిసెంబరు 22, 23 తేదీల్లో బహుళ క్రమశిక్షణా పరిశోధన –ఆవిష్కరణలు అనే అంశంపై జాతీయ సదస్సు జరుగుతుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ని కళాశాల ఎండీ కె.శశికిరణ్ వర్మ మంగళవారం ఆవిష్కరించారు. విద్యావేత్తలు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, ఆధునిక సాంకేతిక మార్పులపై సమాచార మార్పిడికి ఈ మంచి వేదికవుతుందన్నారు. వివరాలకు 99993 96738, 96523 42835ను సంప్రదించాలన్నారు.

అమ్మ అలంకారం.. భక్తులకు అపురూపం



ఉమామార్కండేయేశ్వర స్వామి ఆలయంలో..



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత



గాయత్రీ మాతగా కడియపులంక అపర్ణాదేవి



మోరంపూడి సాయినగర్ విజయ కనకదుర్గాదేవి ఆలయంలో..

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం సిటీ, రూరల్ పరిధిలో మూడో రోజు మంగళవారం శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. దేవీచౌక్‌లో అమ్మవారు గాయత్రీ దేవిగా, ఉమా మార్కండేయేశ్వరస్వామి దేవాలయంలో గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు.. వాసవీ కన్యకాపరమేశ్వరిని గులాబీ పువ్వులు, కాయిన్లతో అందంగా అలంకరించారు. దేవీచౌక్‌లో గాయత్రీదేవిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. ఆలయ గౌరవాధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.

కడియం: కడియపులంకలోని హరిహర మహాక్షేత్రంలోని అపర్ణాదేవిని గాయత్రీ మాతగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. దుళ్ల, కడియం తదితర గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి.

జగన్ పాలనలో బీసీలకు ప్రాధాన్యం

- కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- కడియంలో ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు అన్ని విధాలా ప్రాధాన్యం దక్కిందని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. స్థానిక గిరజాల కల్యాణ మండపంలో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ అన్ని పార్టీలకూ పల్లకీ మోసే బోయలుగా ఉన్న బీసీలు, ఇకపై పల్లకీలో కూర్చోబోయే రోజులు ఆసన్నమవుతున్నాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత బీసీల సంక్షేమ, రాజకీయ ప్రాధాన్యతను ఏ పార్టీ పట్టించుకోలేదన్నారు. కానీ సీఎం జగన్ బీసీలను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రతి బీసీ సోదరుడూ జగన్‌కు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను మాట్లాడుతూ బీసీలను తన ఆత్మబంధువులుగా ప్రేమిస్తున్న జగన్‌కు సంపూర్ణ మద్దతు, ఆశీసులు ప్రతి ఒక్కరూ అందజేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత బీసీలపై ఉందన్నారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో బీసీల జనాభా, ఓటర్లు ఎక్కువేనన్నారు. రూరల్ నియోజకవర్గంలో రెండున్నర లక్షల మంది ఓటర్లు ఉంటే లక్షా 25 వేల మంది బీసీలేనన్నారు. బీసీ సామాజికవర్గానికి చెందిన అభ్యర్థిని వైఎస్సార్ సీపీ ప్రకటించిన నేపథ్యంలో ప్రతి బీసీ ఓటు పడేలా జాగ్రత్త పడాలని, అలాగే ఇతర సామాజికవర్గాల మద్దతు లభించేలా ఇప్పట్నుంచే ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి శేషగిరి, బండారు శ్రీను, గుత్తుల వాసు, లావేటి రమేష్, బైవరపు నాగేశ్వరరావు, సర్కార్ బాషా, పూడి వీర బ్రహ్మం, మైసర్ల శ్రీనివాసు, వనుం పుత్రయ్య, వీరనాగు, గోవిందు, ముత్యం పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఎంతో మేలు



తొర్రేడులో కళ్లజోడు అందజేస్తున్న ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు సచివాలయం 2 పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 554 మందికి వైద్య సేవలు అందించారు. 30 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, సచివాలయ కన్వీనర్లతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించారు. కార్డియాలజిస్ట్ జి.స్నేహ, గైనకాలజిస్ట్ మనోజ్ఞ, పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్ నేతృత్వంలో వైద్యులు ఈ.నాగదేవి, కె.జగదీష్ కృష్ణ రోగులకు వైద్యసేవలు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి చెరుకూరి రాణి, తొర్రేడు సొసైటీ చైర్‌పర్సన్ చిట్టూరి వెంకటరావు, సచివాలయ కన్వీనర్లు మంగం శేఖర్‌బాబు, వేముదాసి సునీల్, పార్టీ నాయకులు మెప్పిలి రాజు, చోడదాసి రాహుల్ కుమార్, మంగం రాజు, యడ్ల సురేష్ పాల్గొన్నారు.

619 మందికి వైద్య పరీక్షలు

కడియం: పొట్టిలంక సచివాలయం 2 పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 619 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్లు ఎన్.జెస్సీ సుప్రియ, స్వరూప ఆధ్వర్యంలో జనరల్, ఆప్తమాలజీ, ఆంకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాలకు చెందిన వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలను చేపట్టారు. అలాగే 117 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. 19 మందిని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, స్థానిక నాయకుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో కె.రత్నకుమారి, ఎంఈవో వి.లజపతిరాయ్ తదితరులు పాల్గొన్నారు.



పొట్టిలంకలో మందులు పంపిణీ చేస్తున్న కొత్తపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నాగేంద్ర



శంభూనగర్ యూపీహెచ్‌సీలో నిర్వహించిన శిబిరంలో గర్భిణికి వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ మనోజ్, చిత్రంలో వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి మింది నాగేంద్ర

శంభూనగర్‌లో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక శంభూనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన శిబిరంలో 402 మందికి వైద్యసేవలు అందించారు. 17 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, సచివాలయ కన్వీనర్లతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించారు. గర్భిణి గంపల నీలవేణికి బీపీడౌన్ కావడంతో వైద్యశిబిరంలో డాక్టర్ మనోజ్ వెంటనే వైద్యపరీక్షలు చేసి సత్వరమే వైద్యసేవలు అందించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కొప్పినీడి ప్రసాద్ (రాజమౌళి), సచివాలయ కన్వీనర్లు దుంపాచంద్రారెడ్డి, దమ్ము ప్రసాద్, షేక్ ఇమామ్, బాబ్జిరెడ్డి, రొంపిచర్ల రమేష్, మేడపాటి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇన్నీసుపేట యూపీహెచ్‌సీలో...

ఇన్నీసుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన శిబిరంలో 451 మందికి వైద్యసేవలు అందించగా, 27 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫర్ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి శిబిరాన్ని సందర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు.

త్వరితగతిన భవనాల నిర్మాణం



హుకుంపేట సచివాలయం-1 భవనాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ జగదాంబ

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జగదాంబ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె పిడింగొయ్యి గ్రామ సచివాలయం 4 పరిధిలో నిర్మాణంలో ఉన్న సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను పరిశీలించారు. త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. ఇటీవల ప్రారంభించిన హుకుంపేట సచివాలయం 1 భవనాన్ని పరిశీలించారు. ఆమె వెంట హుకుంపేట పంచాయతీ కార్యదర్శి జి.వెంకటరావు, ఉపాధి ఏపీవో సత్యవతి ఉన్నారు.

కడియం: మండలంలోని వేమగిరిలో నిర్మిస్తున్న సచివాలయ భవనాలను డ్వామా పీడీ పి.జగదాంబ మంగళవారం పరిశీలించారు. భవనాల నిర్మాణాలు ఏ స్టేజ్‌లో ఉన్నాయన్న నివేదికను ప్రభుత్వానికి అందించేందుకు పరిశీలిస్తున్నట్లు జగదాంబ తెలిపారు. ఆమె వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

- పాత గొడవలతోనే దారుణ హత్య
- వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ విజయకుమార్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌కు చెందిన ఇసిరి నరేష్‌బాబు (పెద్ద)(27)ను హత్య చేయడంతో పాటు అతడిని సోదరుడు సురేష్‌ను గాయపరిచిన కేసులో అదే ప్రాంతానికి చెందిన రంకిరెడ్డి ప్రేమ్‌కుమార్, ధవళేశ్వరం ఎర్రకొండ ప్రాంతానికి చెందిన కుడిపూడి దుర్గామనోహర్‌ను అరెస్టు చేసినట్లు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్ తెలిపారు. ఈనెల 10వ తేదీ సాయంత్రం 6.30 గంటల సమయంలో బొమ్మూరు జేఎల్‌బీనగర్ ఖాళీ ప్రదేశంలో నరేష్ బాబు, సురేష్‌ను రంకిరెడ్డి ప్రేమ్‌కుమార్ బటన్ చాకుతో పొడిచాడు. ఈ ఘటనలో నరేష్ బాబు మృతి చెందగా, సురేష్ ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సురేష్ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం బొమ్మూరు జేఎల్‌బీనగర్ పాత ఎంఆర్‌వో కార్యాలయం రోడ్డులో రంకిరెడ్డి ప్రేమ్‌కుమార్‌ను, అతడికి సహకరించిన ధవళేశ్వరం ఎర్రకొండ ప్రాంతానికి చెందిన కుడిపూడి దుర్గా మనోహర్‌లను అరెస్టు చేశారు. అతడి వద్ద బటన్ చాకును స్వాధీనం చేసుకున్నారు. కాగా.. నరేష్‌బాబుతో ప్రేమ్‌కుమార్‌కు పాత గొడవలు ఉన్నాయి. దానితో పాటు ఇటీవల ప్రేమ్‌కుమార్‌కు చెందిన ఫ్లెక్సీలను చింపివేయడంతో ఇరువురి మధ్య వివాదం పెరిగింది. ఈ నేపథ్యంలోనే దుర్గా మనోహర్ సహాయంతో ప్రేమ్‌కుమార్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. నిందితులు ఇద్దరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

శరవేగంగా రహదారి నిర్మాణం

- కాతేరు నుంచి తొర్రేడు వరకూ చురుకుగా పనులు
- విద్యుత్ స్తంభాల మార్పు



తొర్రేడులో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు నుంచి తొర్రేడు వరకూ చేపట్టిన ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను సైతం తొలగించి, కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. వెట్‌మిక్స్ మెకడం లేయర్ విధానంలో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. వివరాలు ఇలా.. కాతేరు గామన్ బ్రిడ్జి నుంచి సీతానగరం వరకూ సుమారు రూ.70 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం నాలుగులైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టింది. ఇందులో రూరల్ నియోజకవర్గ పరిధిలో గామన్ బ్రిడ్జి నుంచి తొర్రేడు గ్రామం వరకూ సుమారు 5.5 కిలోమీటర్లు ఉంది. ఇప్పటికే ఈ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రస్తుతానికి వెట్‌మిక్స్‌మెకడం (డబ్ల్యూఎంఎం) లేయర్ ఒకటి వేశారు. ప్రస్తుతం విద్యుత్‌శాఖకు స్తంభాలు మార్పు చేసేందుకు నిధులను చెల్లించడంతో ఆ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అవి పూర్తికాగానే డబ్ల్యూఎంఎం లేయర్ మరొకటి వేసిన తరువాత రెండు లేయర్లు బీటీ రోడ్డు నిర్మిస్తారు. దీంతో ఈ రోడ్డులో భారీ వాహనాలు తిరిగినప్పటికీ ఎటువంటి ఇబ్బంది ఉండదు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఈ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

> **త్వరితగతిన పూర్తిచేస్తాం**
>
> గామన్ బ్రిడ్జి నుంచి తొర్రేడు వరకూ రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వెట్‌మిక్స్‌మెకడం లేయర్ వేశాం. విద్యుత్ స్తంభాలు పూర్తయిన తరువాత డబ్ల్యూఎంఎం ఒక లేయర్, రెండు లేయర్లు బీటీ రోడ్డు వేయడం జరుగుతుంది. త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం.
>
> – మధుసూదనరావు, డీఈ, ఆర్అండ్‌బీ, రాజమహేంద్రవరం

ఘనంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న ఐఎస్‌టీఎస్ ఇంజినీరింగ్ విద్యార్థినులు

రాజానగరం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో భాగంగా ఉన్న బతుకమ్మ సంబరాలు తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం కనువిందు చేశాయి. కళాశాల చైర్‌పర్సన్ కె.అనూషా రెడ్డి, ప్రిన్సిపాల్ వై.రాజశ్రీ రావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థినులు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు. సంప్రదాయ వస్త్రాలను ధరించి, వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి, ఆటపాటలతో కళాశాల ప్రాంగణంలో ఆధ్యాత్మిక సుగంధాలు వెదజల్లారు. విద్యార్థినులకు భిన్న సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియాజేయాలనే ఆలోచనతో కళాశాలలో విద్యార్థినులతో కలిసి బతుకమ్మ సంబరాలను నిర్వహించామని చైర్మన్ ఉపేంద్రరెడ్డి తెలిపారు.